క్లుప్తంగా

అన్నపూర్ణకు పూర్ణ కుంభం సమర్పణ


అన్నపూర్ణకు పూర్ణ కుంభం సమర్పిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: అమలాపురం రూరల్ నడిపూడిలో అన్నపూర్ణా సహిత విశ్వేశ్వర స్వామి ఆలయంలో దీపావళి సందర్భంగా గురువారం కుంపట్ల గోపి దంపతులు అన్నపూర్ణమ్మకు అన్నం రాశి కుంభం సమర్పించారు. అర్చకులు పండు స్వామి ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం దీనిని ప్రసాదంగా భక్తులకు అందించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ అమలాపురం పట్టణ సంఘ చాలక్ డాక్టర్ కొప్పినీడి రమణ కుమార్, అల్లాడ శరత్‌బాబు, మండేల బాబి, అరిగెల బాబి, అధికారి వెంకటేశ్వర రావు, మేడిది వీరబాబు, ఆర్వీ నాయుడు, కుంపట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా చిన జీయర్ స్వామి జన్మదిన వేడుకలు


జన్మదిన వేడుకలో మాట్లాడుతున్న డీటీవో శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: శ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి జన్మ దినోత్సవం సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో రామానుజ దాసుడు వరదా సూరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా అధికారి (టీటీవో) డి.శ్రీనివాసరావు, పట్టణ ఎస్సై కిషోర్ బాబు అతిథులుగా పాల్గొన్నారు. వారి చేతుల మీదుగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. డీటీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన జీయర్ స్వామి సనాతన ధర్మాన్ని కాపాడేందుకు యజ్ఞ యాగాదులు చేస్తూ సమాజ శ్రేయస్సు కోసం పరితపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులతో పాటు సంఘ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్తిక స్నానాలకు ఏర్పాట్లు

యానాం: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక శివమ్ బాత్‌లో భక్తులు స్నానాలు ఆచరించేందుకు గానూ పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి అందుబాటులో ఉంచినట్లు ఈడబ్ల్యూడీ ఇంజినీర్ నాగరాజు తెలిపారు. అయ్యప్ప స్వాములు స్నానాలు ఆచరించేందుకు జీసెస్ విగ్రహం సమీపంలో గోదావరి ఒడ్డున రక్షణ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కనకాలపేటలో ఘాట్ వద్ద సైతం ఏర్పాట్లు చేశామన్నారు.

శ్రీదేవి ఆలయానికి దీపావళి శోభ

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీదేవి మార్కెట్‌లో గల దేవీ ఆలయాన్ని గురువారం దీపావళి పర్వదినం సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ పూల మాలలతో శోభాయమానంగా తీర్చిదిద్దింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో వేలాది మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. ఆలయాన్ని పూల దండలతో ఆకర్షణీయంగా అలంకరించారు. భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ సేవలు చిరస్మరణీయం

ముమ్మిడివరం: భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని ముమ్మిడివరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువు గట్టున ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆమె చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పెన్మత్స జగ్గప్పరాజు, పి.ఉదయ భాస్కర వర్మ, పాలెపు ధర్మారావు, వడ్డి నాగేశ్వరరావు, దివ్వి వెంకన్నబాబు, ముషిని శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ముమ్మిడివరం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ముమ్మిడివరంలో హెచ్‌పీ గ్యాస్, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఉచిత గ్యాస్ పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. మహిళాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ తాడి వెంకటాచార్య, నాయకులు, గ్యాస్ ఏజెన్సీల డీలర్లు పీఎస్ఆర్ సోమయాజులు, త్రినాథ్ పాల్గొన్నారు.

పంచారామాలను చూసొద్దామా..

పవిత్ర కార్తిక మాసంలో ఆధ్యాత్మిక, విహార యాత్రలకు వెళ్లే ప్రయాణికుల కోసం అంబేడ్కర్ కోనసీమ కేంద్రం అమలాపురం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడపేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తులు ప్రసిద్ధ పంచారామ క్షేత్రాలను సోమవారం దర్శించుకునే విధంగా బస్సు సర్వీసులు సిద్ధం చేసింది. ప్రత్యేక బస్సు సర్వీసులు ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు బయలుదేరనున్నాయి.

- ప్రతి సోమవారం దర్శించుకొనే విధంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు
- ఆదివారం రాత్రి 7 గంటల నుంచి ప్రారంభం
- కార్తిక మాసంలో ఆధ్యాత్మిక, విహార యాత్రలకు అవకాశం
- అమలాపురం నుంచి శబరిమల, మన్యసీమకు వెళ్లే ప్రయాణికులకు సౌలభ్యం

అమలాపురం రూరల్: అమరావతిలోని అమరేశ్వర స్వామి, భీమవరం సోమేశ్వర స్వామి, పాలకొల్లు రామలింగేశ్వర స్వామి, సామర్లకోట కుమార భీమేశ్వరుడు, ద్రాక్షారామ భీమేశ్వర స్వామి శైవ క్షేత్రాలను ప్రతి సోమవారం దర్శించుకునేలా సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు బస్సు బయలు దేరి పంచారామాలు తిరిగి సోమవారం రాత్రి 7 గంటలకు అమలాపురం చేరుకుంటుంది. నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో ఈ ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఈ సర్వీసులకు పెద్దలు ఒకొక్కరికి ఎక్స్‌ప్రెస్‌కు రూ.950లు, అల్ట్రా డీలక్స్‌కు రూ.1170లు, సూపర్ లగ్జరీకు రూ.1220లుగా టిక్కెట్ ధర నిర్ణయించారు. పిల్లలకు ఎక్స్‌ప్రెస్‌కు రూ.720లు డీలక్స్ సర్వీసుకు రూ.880లు, సూపర్ లగ్జరీకు రూ.920లుగా టిక్కెట్ ధర నిర్ణయించారు.

శబరిమలైకు..

అయ్యప్ప భక్తులకు అమలాపురం డిపో నుంచి శబరిమలైకు ప్రత్యేక సర్వీసులు నడుతున్నారు. ఆరు రోజుల యాత్రలో భాగంగా అమలాపురం, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, పళణి, ఎరుమేలి, శబరిమల, మధురై, కంచి, తిరుపతి, విజయవాడ క్షేత్రాలు దర్శించుకునేందుకు ఈ బస్సులు ఏర్పాటు చేశారు. సూపర్ లగ్జరీకి టిక్కెట్ ధర రూ.5 వేలుగా నిర్ణయించారు. ఇంద్ర ఏసీ బస్సుకు రూ. 6,400గా నిర్ణయించారు. ఎక్కువ మంది స్వాములు సంఘటితంగా కోరితే వారు కోరిన ప్రదేశం నుంచి బస్సు సర్వీసులు నడపనున్నారు.

కోనసీమ నుంచి మన్య సీమకు..

కార్తిక మాసంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ముఖ్యమైన పుణ్య క్షేత్రాలు, మారేడుమిల్లిలో విహార యాత్రకు వెళ్లేవారి కోసం అమలాపురం నుంచి ఏజెన్సీ ప్రాంతమైన మన్య సీమకు బస్సు సర్వీసులు నడుపుతున్నారు. కార్తిక మాసంలో రంప చోడవరం ఏజెన్సీలో ఉన్న మన్యం అందాలను వీక్షించేందుకు 'మన్యసీమ దర్శిని' పేరుతో బస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం నుంచి అమలాపురం నుంచే ఈ బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నారు. 10, 17, 24 తేదీల్లో అమలాపురం నుంచి మారేడుమిల్లి వరకు వెళ్లే ఈ సర్వీసులో మన్యంతో పాటు పలు ఆలయాలను కూడా దర్శించుకోవచ్చు. ర్యాలిలోని జగన్మోహిని కేశవస్వామి ఆలయం, కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, సీతపల్లిలోని బాపనమ్మ గుడి, రంపలోని పురాతన శివాలయం, మారేడుమిల్లిలోని కాఫీ తోటలు, రబ్బరు తోటలు, ఔషద మొక్కలు, జల తరంగిణి, జలపాతం, పాములేరు తదితర ప్రాంతాలను చూపించిన అనంతరం యాత్రికులను తిరిగి రాజమండ్రికి తీసుకువచ్చి ఇస్కాన్ టెంపుల్ చూపిస్తారు. దీనికి గానూ ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు టిక్కెట్ ధర పెద్దలకు రూ.450లు, పిల్లలకు రూ.350లుగా నిర్ణయించారు. కోనసీమలోని యాత్రికులు మన్యం ప్రాంతానికి వెళ్లే అవకాశాలు తక్కువగా ఉంటాయని ప్రయాణికులు, విహార యాత్రలకు వెళ్లేవారి సౌకర్యార్థం ఈ సర్వీసు ప్రారంభించామని అధికారులు తెలిపారు. 50 సీట్ల బస్సును రిజర్వ్ చేసుకోవచ్చునని చెప్పారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు గ్రూపుగా వెళితే ఎప్పుడైనా సరే బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తున్నారు. ఇతర వివరాలకు అసిస్టెంట్ మేనేజర్‌ను 7013868687 నంబరులోనూ, అడ్వాన్స్ రిజర్వేషన్ కోసం 9959225576 నంబరు లోనూ, బస్ స్టేషన్ సిబ్బందిని 9959225550, 7382909798, 9908836444 నంబర్లలో సంప్రదించాలని డీఎం సత్యనారాయణమూర్తి కోరారు.


పంచారామాలకు సిద్ధం చేసిన ప్రత్యేక బస్సు

ప్రయాణికులకు సువర్ణావకాశం



"కార్తిక మాసంలో ఆధ్యాత్మిక, విహార యాత్రలకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి. పంచారామ క్షేత్రాలతో పాటు అయ్యప్ప భక్తుల కోసం శబరిమలైకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశాం. ఎక్కువ మంది స్వాములు ఉంటే వారు కోరిన ప్రదేశం నుంచి సర్వీసులు నడుపుతున్నాం. కోనసీమ నుంచి మన్యసీమకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేశాం. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ మేనేజర్, అడ్వాన్స్ రిజర్వేషన్ కేంద్రాలను సంప్రదించాలి."
చల్లా సత్యనారాయణ మూర్తి, డిపో మేనేజర్, అమలాపురం.

అమరజీవి ఆశయ సాధనకు కృషి చేద్దాం

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ వేడుక

అమలాపురం టౌన్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమర జీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం, మున్సిపల్ సర్క్యులర్ బజార్ ఆవరణలో గల పొట్టి శ్రీరాములు విగ్రహాలకు ఆర్య వైశ్య నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ రెండు కార్యక్రమాల్లో సంఘ కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కన్యకా పరమేశ్వరి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అప్పన వీరన్నతో పాటు సంఘ నాయకులు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

స్థానిక సర్క్యులర్ బజార్ ఆవరణలో మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరిగాయి. పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్లబ్ ప్రతినిధులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు భమిడిపాటి పద్మావతి, కార్యదర్శి యర్రమిల్లి అనంతలక్ష్మి, క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పచ్చిగోళ్ల సత్యకుమారి, క్లబ్ బులిటన్ ఎడిటర్ పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొని పొట్టి శ్రీరాములు త్యాగాల గురించి మాట్లాడారు.

చేతి వృత్తుల సంఘం ఆధ్వర్యంలో..

జిల్లా చేతి వృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక సంఘ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరిగాయి. అనంతరం స్థానిక సర్క్యులర్ బజార్ ఆవరణలో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.


పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న పట్టణ ఆర్య వైశ్య సంఘం నాయకులు

కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరవు

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం శాంతి భద్రతల విషయంలో వైఫల్యం చెందిందని దీంతో సమాజంలో దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ తదితర ప్రజా సంఘాలు దుయ్యబట్టాయి. మండపేటలో దళిత యువకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశాయి. జిల్లా సీపీఐ కార్యదర్శి కె.సత్తిబాబు ఆధ్వర్యంలో సీపీఐ బృందం మండపేటలో బాధితులను పరామర్శించారు. మండపేట పోలీసు అధికారులతో ఈ కేసు విషయమై మాట్లాడారు. కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు తదితర ప్రజా సంఘాల నాయకులు అమలాపురంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. మండపేట దళిత యువకులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కేవీపీఎస్ అల్లవరం మండల కన్వీనర్ గెడ్డం విజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పాలమూరి శ్రీనివాసరావు తదితరులు మండపేటలో జరిగిన దాడిని దుయ్యబట్టారు.


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

మొరాయించిన ఆధార్ సర్వర్

- పింఛన్ కోసం అవ్వా తాతల ఎదురు చూపులు
- సాయంత్రం 4 గంటల నుంచి పంపిణీ

అల్లవరం: వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు అందించే పింఛన్ పంపిణీలో సాంకేతిక సమస్య తలెత్తింది. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆధార్ సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో అల్లవరం మండలంలోని 23 సచివాలయాల్లో పెన్షన్ల పంపిణీ నిలిచి పోయింది. దూర ప్రాంతాల నుంచి పెన్షన్ తీసుకోవడానికి సచివాలయానికి వచ్చిన లబ్ధిదారులు సర్వర్ మొరాయించడంతో సచివాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి ఎదురయ్యింది. సాయంత్రం 4 గంటల నుంచి సర్వర్ అందుబాటులోకి రావడంతో అప్పటికే వేచి చూస్తున్న లబ్ధిదారులకు పెన్షన్‌ను సచివాలయ సిబ్బంది అందించారు. సచివాలయ ఉద్యోగులు బయో మెట్రిక్‌లో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. మండల వ్యాప్తంగా 23 సచివాలయాల్లో 9,332 పెన్షన్లకు గాను 93 శాతంతో 8, 687 పెన్షన్లు పంపిణీ చేసి రెండో స్థానంలో నిలిచామని ఎంపీడీఓ కృష్ణమోహన్ తెలిపారు. సర్వర్ ఇబ్బంది పెట్టినా సచివాలయ సిబ్బంది పని తీరు బాగుందన్నారు.

క్షీణించిన పారిశుధ్యం.. వీధుల్లో దుర్గంధం


ఆలయం సమీపంలో పేరుకుపోయిన చెత్త


వ్యాపార సముదాయాల వద్ద వ్యర్థాలతో దుర్గంధం

యానాం: యానాం పట్టణంలో పారిశుద్య పనులు గత కొద్ది రోజుల నుంచి నిలిచిపోవడంతో దుర్గంధం వ్యాపించి ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేస్తోందని శుక్రవారం పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్య పనులు నిర్వహిస్తున్న హెచ్ఆర్ స్క్వేర్ సంస్థ సిబ్బందికి గత 8 నెలల నుంచి పుదుచ్చేరి లోకల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్ (ఎల్ఎడి) చెల్లించకపోవడంతో సిబ్బంది మూడు రోజుల నుంచి పారిశుద్య పనులు నిలిపి వేశారు. దీంతో వీధుల్లో టన్నుల కొద్దీ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తుండటంతో పట్టణ వాసులు ముక్కు మూసుకొని వెళుతున్నారు. రెస్టారెంట్లు, వ్యాపార సముదాయాల నుంచి వస్తున్న టన్నుల కొద్దీ వ్యర్థాలు, దీపావళి నాడు కాల్చి పడేసిన మందు గుండు చెత్తను స్థానిక డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉంది. ఆ పనులు సైతం నిలిపి వేయడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అల్వార్ దాస్‌కు వాకర్ల నివాళి

అమలాపురం టౌన్: నడక ఆరోగ్యానికి రక్షణ అని పిలుపు నిచ్చిన నడక ప్రదాత సుంకర అళ్వార్ దాస్ జయంతి సందర్భంగా అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్‌కు చెందిన వాకర్స్ గురువారం ఆయనకు ఘన నివాళులు అర్పించారు. అళ్వార్ దాస్ ఇచ్చిన నడక పిలుపు తోనే నేడు కోట్లాది మంది ఆరోగ్యం కోసం నడక బాట పట్టారని వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వర ప్రసాద్ అన్నారు. అళ్వార్ దాస్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వలవల నాయుడు, కోశాధికారి డాక్టర్ పీఎస్ శర్మ, అంతర్జాతీయ వాకర్స్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, వాకర్స్ ఏరియా కో ఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, వాకర్స్ ప్రతినిధులు నూకల సత్యనారాయణ, కుడుపూడి త్రినాథ్, గోటేటి గంగాధర్, పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక సర్క్యులర్ బజార్ ప్రాంగణంలో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్య వర ప్రసాద్ ఆధ్వర్యంలో క్లబ్ ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.


ఆళ్వార్ దాస్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతినిధులు

ఉచిత సిలిండర్లతో పేదలకు లబ్ధి

కార్మిక శాఖ మంత్రి సుభాష్

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దీపం-2 పథకం కింద అర్హులైన కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈ సందర్భంగా వైపుణ్య దుర్గాదేవి ఇంటి వద్ద దీపం-2 పథకాన్ని మంత్రి గ్యాస్ పొయ్యి వెలిగించి ప్రారంభించారు మంత్రి మాట్లాడుతూ దీపం-2 పథకం కింద కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని ప్రత్యేకంగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. 2025 మార్చి 31 వరకు మొదటి సిలిండర్ బుకింగ్‌కు అవకాశం ఉందన్నారు. ఈ పథకం కింద తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరికీ ఉచిత సిలిండర్లు ఇస్తారని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ దీపం-1, దీపం-2 పథకాలతో పాటు డ్వాక్రా సంఘాలకు ఆర్థిక స్వావలంబన కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ నిషాంతి, మెట్ల రమణబాబు, జిల్లా పౌర సరఫరా అధికారి ఉదయ భాస్కర్, బొర్రా ఈశ్వరరావు, పెచ్చెట్టి చంద్రమౌళి, నల్లా స్వామి, రామస్వామి, సత్యలక్ష్మి, వెంకటలక్ష్మి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

తాళ్లరేవు: లయన్ వత్సవాయి వల్లీబాబు జయంతి సందర్భంగా లయన్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, ప్రతినిధులు వేలూరి సూర్యనారాయణ, చిట్నీడి శ్రీనివాస్ తదితరుల చేతుల మీదుగా చొల్లంగి గురుకుల పాఠశాలలో 12 సీలింగ్ ఫ్యాన్‌లు, తాళ్లరేవు సీహెచ్‌సీలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పేదలకు దుప్పట్లు, పేద బ్రాహ్మణ విద్యార్థికి ట్యాబ్ నిమిత్తం రూ.16 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వల్లిబాబు లయన్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీపతిరాజు, క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు, శివనాగరాజు, కె.ఆదినారాయణ రెడ్డి, నడింపల్లి వినోద్, పెద్దిరెడ్డి ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ముమ్మిడివరం: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ముమ్మిడివరం ఎక్సైజ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. కొత్తపేట మండలం చిన్న గొల్లపాలెం గ్రామానికి చెందిన కేతా శ్రీనివాసరావు యానాం నుంచి ఆరు బీర్లు, నాలుగు మద్యం సీసాలు తరలిస్తుండగా ఎదురులంక వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే అన్నంపల్లిలో ఒక వ్యక్తి యానాం మద్యం తరలిస్తుండగా టాస్క్ ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులిద్దరిపైనా కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

ఘనంగా పుదుచ్చేరి విమోచన వేడుకలు


దేశభక్తి పాటల నృత్యాలు


జాతీయజెండాను ఆవిష్కరించిన ఆర్ఏఓ మునిస్వామి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

యానాం: పుదుచ్చేరి విమోచనా దినోత్సవ వేడుకలను శుక్రవారం యానాంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్ఏఓ మునిస్వామి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం సాధారణ పోలీసు, ఐఆర్‌బీ బెటాలియన్, హోమ్‌గార్డు, ట్రాఫిక్, వివిధ పాఠశాలల ఎన్‌సీసీ విభాగాలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శాంతి కపోతాలు ఎగుర వేశారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. వివిధ పాఠశాలల బాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పెరేడ్, సాంస్కృతిక నాట్య ప్రదర్శనల్లో మెరుగైన ప్రతిభ సాధించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం పాల్గొన్నారు.

రేపు 'అమరజ్యోతి అంబేడ్కర్' పుస్తకావిష్కరణ

యానాం: దళిత సాహిత్య అకాడమీ దక్షిణ భారత శాఖ అధ్యక్షుడు, కలైమామణి పొనుగుమట్ల విష్ణుమూర్తి రచించిన 'అమరజ్యోతి అంబేడ్కర్' పరిశోధనాత్మక గ్రంథావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరగనుంది. ఆ రోజు సాయంత్రం 3 గంటలకు స్థానిక గోపాల్‌నగర్‌లోని అంబేడ్కర్ విజ్ఞాన భవన్‌లో ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు అధ్యక్షతన జరిగే గ్రంథావిష్కరణ కార్యక్రమానికి డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి, ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పాల్గొంటారన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి


గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఉప్పలగుప్తం: విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా సమగ్ర శిక్ష అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు సూచించారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం పాఠశాలలో నిర్మాణంలో ఉన్న ల్యాబ్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సంహిత విద్య కో ఆర్డినేటర్ సత్యనారాయణ, ఎంఈవో-2 సత్తి సత్యకృష్ణ, హెచ్ఎం లంకా రాణి తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ విజేత శ్రీధర్‌కు అభినందన


శ్రీధర్‌ను అభినందిస్తున్న డీఈవో సలీమ్ బాషా, అధికారులు

అమలాపురం టౌన్: రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో రెండు రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అమలాపురం విద్యార్థి శ్రీధర్‌ను డీఈవో షేక్ సలీమ్ బాషా అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లో విద్యార్థి శ్రీధర్ క్రీడా ప్రతిభను డీఈవో శుక్రవారం ప్రశంసించి జాతీయ స్థాయిలో విజేత కావాలని ఆకాంక్షించారు. శ్రీధర్ స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అమలాపురం డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశం, సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కామేశ్వరరావు, సీఆర్పీ ఎం.శ్రీనుబాబు తదితరులు విజేత శ్రీధర్‌ను అభినందించారు.

పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన పెంచండి

అమలాపురం టౌన్: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే పట్ట భద్రులుగా నమోదై ఉన్న ఓట్లను ప్రస్తుత ప్రభుత్వం తొలగించడం సరి కాదని అల్లవరం మండలం సామంతకుర్రుకు చెందిన కొల్లు గౌతమ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈయన పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పట్ట భద్రుడు ఓటును తాజాగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని పట్ట భద్రులకు ప్రభుత్వం అవగాహన కల్పించాలని కోరారు. ఓటు నమోదు కోసం ఈ నెల 6 వరకు నిర్దేశించిన గడువు తేదీని పొడిగించాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు రాత పూర్వకంగా అభ్యర్థించారు. తక్షణమే పాత ఓట్లను తొలగించి కొత్త ఓటరుగా నమోదు కావాలని పట్టభద్రులకు ఎక్కడికక్కడ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన వినతి పత్రాల్లో పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ


వెంకటేశ్వరరావుని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అల్లవరం: అనారోగ్యం కారణంగా చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావుని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను శుక్రవారం పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. దేవగుప్తంలోని ఆయన నివాసంలో వెంకటేశ్వరరావుని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ సాధనాల వెంకటరావు, కౌన్సిలర్లు దొమ్మేటి రాము, మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, సీనియర్ నాయకులు గుంటూరి బాలరాజు, కుడుపూడి సూర్యప్రకాష్, పినమాల విక్రమ్, బాలాజీ, శివ పరామర్శించారు.

లోలూరు ఘటనలో కార్మికులు సురక్షితం

అమలాపురం రూరల్: అనంతపురం జిల్లా సింగనమల మండలం లోలూరు గ్రామంలోని సప్తగిరి కర్పూరం ప్రైవేట్ లిమిటెడ్‌లో శుక్రవారం జరిగిన సంఘటనపై కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించారు. అమలాపురంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ పరిశ్రమలోని వెసెల్ మరమ్మతులు నిమిత్తం ఇద్దరు కార్మికులు వెల్డింగ్ పని చేస్తుండగా ఊపిరాడక సొమ్మసిల్లి పోవడంతో వారిని రక్షించేందుకు వెళ్లిన మరో నలుగురు వ్యక్తులు ఊపిరి ఆడక ఇబ్బంది పడ్డారన్నారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, అధికారులు వారిని కిమ్స్ ఎమర్జెన్సీ హాస్పిటల్లో చేర్పించి చికిత్స అందించారన్నారు. ప్రస్తుతం కార్మికులంతా క్షేమంగా ఉన్నారని వారికి ఇబ్బంది జరగలేదని వెల్లడించారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

తాళ్లరేవు: మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, సుంకరపాలెం గ్రామ సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం 450 మంది అయ్యప్ప స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు. సుంకరపాలెం శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం వద్ద టిల్లపూడి నాగేశ్వరరావు భార్య అనంతలక్ష్మి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్ష వడ్డించారు.